# [illegible]

దాదాపు 13 సంవత్సరాల క్రిందటి విషయం అది 1947 లో అనుకుంటాను. అప్పటికి నేనింకా సినిమా రంగంలో ప్రవేశించటం జరగలేదు. ఆసంవత్సరం నేను సరస్వతి గాన నిలయంలో భరతనాట్యం నేర్చుకోవటం ప్రారంభించాను. భరత నాట్యమంటే నాకెందుచేతనో చిన్నతనం నుంచీ మక్కువ ఎక్కువగా ఉండేది. అందుచేతనే అనుకుంటాను నాకు అనతికాలంలోనే ఈకళలో మంచి ప్రావీణ్యం లభ్యింది. 1949 నాటికే అంటే అభ్యాసం ప్రారంభించిన రెండు సంవత్సరాలకాలంలోనే నేను మంచి ప్రావీణ్యం గడించి నాట్యశాస్త్రంలో డిప్లొమాను పుచ్చుకొన్నాను. సినిమాలో చేరాలని నేను అప్పుడు అనుకోవటంలేదు. నేను నేర్చుకున్న ఈ నాట్యకళను ఏవిధంగా ఆరాధించి కళాసేవ చేస్తూండాలా అని ఆరాటపడుతూండే దానిని,

దీనికి తగినట్లుగానే 1950లో కొంతమంది పిల్లలకుభరత నాట్యాన్ని నేర్పటంప్రారంభించాను ఒకరిద్దరు స్టూడెంట్లతో ప్రారంభమైన ఈ ప్రయత్నం ఫలించి త్వరలోనే ఈసంఖ్య పదికి పెరిగింది. వీరందరూ కూడ మాయింటికే వచ్చి నేర్చుకొంటూండేవారు. అయితే ఇది ఇంతటితో ఆగలేదు. బయటి ట్యూషన్లు కూడా కొన్ని రాసాగినయి. అంటే నేను ఆపిల్లల ఇండ్లకు వెళ్ళి ట్యూషన్ చెప్పటమన్నమాట. ఈ ట్యూషన్ల సంఖ్యకూడా క్రమ క్రమంగా పెరగ సాగింది. నేను నేర్చుకున్న విద్యను పదిమందికి అందజేస్తూ ఈవిధంగా కళాసేవ చేస్తున్నాను గదా అని నేను ఎంతో సంతృప్తి పడుతూండేదానిని.

ఈ ట్యూషన్లూ, ఈపద్ధతి చూస్తూ ఉంటే ఒక డ్యాన్సుస్కూలు పెట్టి మరింతగా ఎక్కువమందికి నేను నేర్చుకున్న విద్యను అందజేస్తూ కళాసేవ చేస్తే ఇంకా బాగుంటుందనే ఆలోచన అప్పుడే నామనస్సులో మొలకెత్త సాగింది. ప్రతిరోజు కలల్లో నాకు నేను ప్రారంభించబోయే డ్యాన్సు స్కూలును గురించిన సంగతులే ఎప్పుడూ మెదులుతూ ఉండేవి. నా మనస్సులో మెదులుతూండే ఈ డ్యాన్సు స్కూలు నాకు ఈవాస్తవిక జగత్తులో ఎక్కడా కనిపించనటువంటిది. ఎంతో ఆదర్శప్రాయమైనది. గురు శిష్యుల సంబంధం అక్కడ ఎంతో విశాలమైనది. బోధకులు, బోధితులు అనే తారతమ్యమేమీ ఉండదు. గురు శిష్యులు పరస్పరం ఒకరి నొకరు అర్థం చేసుకుంటూ కొత్త పద్ధతులతో నాట్యకళను గొప్పగా ఆరాధించుతూంటారు.

ఇటువంటి ఊహాలతో, కలలతో నేను ఉక్కిరి బిక్కిరి అవుతుండే దానిని. ఇంత గొప్పకళాసేవ చేయబోతున్నానని మనస్సు ఏదో అనిర్వచనీయమైన ఆనందంలో మునిగి తేలుతూండేది. దాదాపు ఒక వందమంది విద్యార్థినులతో ఆ స్కూలు కళకళలాడుతున్నట్లు, తాళ మృదంగ వాద్య ధ్వనులతో ఆస్కూలు ఎప్పుడూ మారుమ్రోగుతున్నట్లు, నాకళ్ళముందు ఆదృశ్యం ఎప్పుడూ ఆడుతూండేది. ఆ వూహాలలో నా మనస్సు ఆనంద పరవశత్వం పొంది తేలియాడిపోతుండేది.

దీనిని కేవలం వూహాలలోనే ఉంచక, దీనికి వాస్తవిక రూపాన్ని తీసికొని రావటానికై గట్టి కృషినీ కూడా ప్రారంభించాను. ఆసమయంలో నామనస్సులో మెదిలేది కేవలం ఒకే ఒక ఆలోచన. నావూహాలోఉన్న ఈ స్కూలు ఎప్పుడు వాస్తవ రూపం ధరించుతుందా అన్నదే ఆ ఆలోచన. ఇతరములైన విషయాలేవీ నాదగ్గరకు వచ్చేవి కావు. ఈ ఒక్క ఆలోచనే అనేక రూపాలలో నాట్యం చేస్తూండేది. నేను చాలా చిన్నదానినే,

శ్రీమతి రాజసులోచన


జపానీస్ దుస్తులలో రాజసులోచన

ఒక్క ఆడదాని వల్ల ఇంతపని జరుగుతుందా, అన్న అధైర్యమే నాకెప్పుడూ రాలేదు. అది ఆసంకల్పంలో ఉన్న మహిమ అనుకుంటాను. ఎన్ని అడ్డంకులు వచ్చినాసరే ఈ ప్రయత్నాన్ని సఫలీకృతం చెయ్యాలని ఒకగట్టి పట్టుదల నాలో బయలు దేరింది. ఆపట్టుదలముందు ఈ చిల్లర మల్లర విషయాలు అసలు లెక్కలోకే వచ్చేవి కావు. కళాసేవ, ముఖ్యంగానాట్యకళ సేవ ఇదే నాజీవితలక్ష్యం అనుకొన్నాను.

అయితే మానవులు అనుకున్నవన్నీ అనుకున్నట్లుగా జరిగితే అసలు సమస్యలనేవే ఉండవు. మానవుడు ఒకటి తలిస్తే భగవంతుడు వేరొకటి తలుస్తాడన్న సామెత ఉండనే ఉందిగదా. నా విషయంలో కూడ అది రుజువయింది. డ్యాన్సు స్కూలును ప్రారంభించాలని అహోరాత్రులు తపించిన నేను, చివరకు డ్యాన్సు స్కూలు ప్రారంభించ లేకపోయాను. సినిమాలో చేరాలని ఎప్పుడూ అనుకోని నేను సినిమా రంగంలో ప్రవేశించాను. ఆ ప్రవేశించటం కూడ నాట్యతారగా ప్రవేశించాను. క్రమేణా నటనలో నాకున్న ప్రావీణ్యత కనబరచి, ఇప్పుడు సినిమా నటిగా ఉన్నాను. డ్యాన్సు స్కూలు ప్రారంభించి కళాసేవ చేయాలన్న నాప్రయత్నం, అభిలాష అప్పటికి ప్రక్కకు తప్పుకొన్నాయి.

సినిమానటిగా ఉంటూండగానే నేను ఇటీవల అంటే 1960 మార్చిలో టోకియో వెళ్లటం తటస్థించింది. అక్కడ మే నెల వరకు ఉన్నాను. నేను అక్కడ ఉండగానే ఒక విషయాన్ని చూశాను. దానితో నామనస్సులో తిరిగి కల్లోలం ప్రారంభమయింది. అక్కడనే నేను చూసిందేమిటంటే ఒక డ్యాన్సు స్కూలు. దానిలో సుమారు 8000 మంది విద్యార్థులున్నారు. వారు కథక్, కథాకళి, భరతనాట్యం, మణిపురి మొదలైన భారతీయ నృత్యరీతులలో విద్య నేర్చుకొంటున్నారు. ఈ స్కూలు ఆచార్యుడు కిచూ షికాకి బారా అనే ఆయన. ఈయన మనదేశం వచ్చి మన నృత్యరీతులన్నిటినీ అవగాహన చేసుకొని వాటిల్లో కూలంకషమైన శిక్షణ పొంది తనదేశం వెళ్లి అక్కడ డ్యాన్సు స్కూలును ప్రారంభించి శిక్షణ ఇస్తున్నారు. ఆ స్కూలు, దాన్ని నడుపుతున్న పద్ధతి, అక్కడి శిక్షణ, కట్టుబాట్లు నన్ను ఎంతో ముగ్ధురాలిని చేసినాయి. ఆ స్కూలులో ఉన్నంత సేపు నేనొక అపూర్వమైన అనుభూతిని పొందాను. నామనస్సు ఇంతగా ఆనందపడి సంచలించటానికి, డాన్సు స్కూలు ఒకటి ప్రారంభించి కళాసేవ చెయ్యాలని నా మనస్సు లోగడ తపించి యుండడంవల్ల నేమో.

టోక్యోనుంచి వచ్చిన తర్వాత, డ్యాన్సు

స్కూలు ప్రారంభించటానికి సంబంధించిన నా పూర్వపు ఆలోచనలు తిరిగి ముమ్మరంగా రాసాగినాయి. డ్యాన్సు స్కూలు అయినా మరేదైనా కళాసేవ చెయ్యటాన్నే నా జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాను. నేను నా చిన్నతనంలో అనుకొన్న డ్యాన్సు స్కూలు ప్రారంభం, ఈ కళాసేవలో ఒక భాగం మాత్రమే. నేను 1950 లో సినిమారంగంలో ప్రవేశించకుండా ఉన్నట్లయితే నా మనస్సును అంతగా ఆకట్టిన డ్యాన్సు స్కూలునే ప్రారంభించి కళాసేవ చేస్తూండేవాడినేమో! ఇప్పటికీ నాట్యశిక్షణకు ఒక కేంద్రాన్ని నడపాలని అభిలాష ఉంది. ఇది ఎంతవరకు నెరవేరుతుందో చెప్పలేను. కాని ఒక్కటి మాత్రం చెప్పగలను. నాట్యశిక్షణ కేంద్రమైనా, మరేదైనా సరే చేతనైనంతవరకు కళాసేవ చేస్తూండాలనే నేను నా జీవితాశయంగా పెట్టుకున్నాను. దీనిని నిర్విఘ్నంగా కొనసాగించేట్లు చేయుమని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ★



"సీతారామ కళ్యాణం" లో రావణుడు-ఎన్.టి. రామారావు